సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 65.416 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 65.416 టీఎంసీలు ఉన్నాయి. 1265 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,930
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,168
సవర (8 గ్రాములు)	రూ.65,344

గరిష్టం/కనిష్టం
33.2 /23.5

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గాలిలో తేమ 64 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

చెత్త వేయకుండా ముగ్గులు



పొదలకూరురోడ్డు ప్రాంతంలో రోడ్డుపై చెత్త వేస్తున్న ప్రాంతంలో ముగ్గులు వేస్తున్న పారిశుధ్య కార్మికురాలు

నెల్లూరు (బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని ప్రచారం చేస్తున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్న ప్రజల ఆలోచనల్లో మార్పు తీసుకు వచ్చేందుకు కమిషనర్ సూర్యతేజ వినూత్న ప్రయత్నం ప్రారంభించారు. చెత్త వేస్తున్న ప్రదేశాల్లో శుక్రవారం పారిశుధ్య కార్మికుల ద్వారా శుభ్రం చేసి, రంగుల ముగ్గులు పెట్టి, పూల కుండీలు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. స్థానిక 48వ డివిజన్ విరాట్‌నగర్, వీబీఎస్ కల్యాణ మండపం సమీపం, 54వ డివిజన్ వెంకటేశ్వరపురం, కరెంట్ ఆఫీసు సెంటర్ తదితర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ స్థానికులు పెడ చెవిన పెట్టారని, ఈ చర్యలతో వారిలో మార్పు కనిపిస్తుందని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సబ్సిడీ రుణ దరఖాస్తుకు గడువు పొడిగింపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈ డబ్ల్యూఎస్, బలిజ కాపు ఒంటరి కులాలకు అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించినట్లు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఏ నిర్మలాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఫిబ్రవరి 6వ తేదీ ఆఖరి గడువుగా ప్రకటించగా, తాజాగా ఈ నెల 12 వరకు పొడిగించిందని తెలిపారు. కావున అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తును చేసుకోవాలని కోరారు.

పార్టీ మారితే పవర్

- పచ్చ కండువా కప్పుకోవాలని బెదిరింపులు
- కాదంటే వివిధ కారణాలు చూపించి షోకాజ్ నోటీసులు
- పంచాయతీల్లో నిధులు ఆరగించే పన్నాగాలు
- గ్రామీణ ప్రాంతాల్లో పడకేస్తున్న పారిశుధ్యం
- జిల్లాలో పలువురు సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు

▸▸ వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లపై రాజకీయ ఒత్తిళ్లు

కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కుట్రలు, కుతంత్రాలకు పెద్దపీట వేస్తోంది. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను టార్గెట్ చేసి వారిపై రాజకీయ ఒత్తిళ్లతో ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలమైన నేతలుగా చెలామణి అవుతున్న సర్పంచ్‌లపై పార్టీ మారాలంటూ సామదానదండోపాయాలు ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే అనేక మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీ మారితే చెక్‌పవర్ పునరుద్ధరిస్తామని, లేదంటే వేట తప్పదని బెదిరింపులకు దిగుతున్నారు. ఎమ్మెల్యేల ఒత్తిళ్లు తట్టుకోలేక కొందరు ఇప్పటికే పచ్చ కండువాలు కప్పుకున్నారు. అయినా బెదిరింపులకు సడలని తొమ్మిది మంది సర్పంచ్‌ల చెక్ పవర్స్‌ను రద్దు చేశారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కోవూరు: జిల్లాలో అధికార టీడీపీ దిగజారుడు రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. ప్రజలు గతంలో సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీని ఛీ కొట్టారు. అప్పటి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన సర్పంచ్‌లను, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను బెదిరించి, ప్రలోభాలు పెట్టి తమ పార్టీ కండువాలు కప్పి నిస్సిగ్గుగా జబ్బలు చరుచుకుంటుంది. ఇటీవల జరిగిన నెల్లూరు డిప్యూటీ మేయర్, బుచ్చిరెడ్డిపాళెం వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఇదే పంథాను అవలంబించి టీడీపీ బలమంటూ ప్రచారం చేసుకోవడాన్ని జిల్లా ప్రజలు ఛీదరించుకుంటున్నారు. మరో వైపు జిల్లాలో సర్పంచ్‌లను చెక్ పవర్ రద్దు చేసి టీడీపీకి అనుకూలంగా ఉండే వారికి పవర్స్ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న సర్పంచ్‌లకు నిధులిచ్చేందుకు అడ్డు పడడంతో పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడి చెత్త అక్కడే, పేడ దిబ్బలు పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యం లోపించడంతో దోమల బెడద అధికమైంది. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

ఫిర్యాదులతో చెక్‌పవర్ రద్దు

జిల్లాలో 722 పంచాయతీలు ఉన్నాయి. సుమారు 25 లక్షలకు పైగా జనాభా ఉంది. కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలకు సర్పంచ్‌లతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆదరాభిమానాలతో గెలుపొందిన సర్పంచ్‌లతో వైఎస్సార్‌సీపీ క్షేత్ర స్థాయిలో బలంగా ఉంది. దీంతో ఆ పార్టీ పదవులను బలవంతంగా లాక్కునేందుకు కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారు. టీడీపీకి అనుకూలంగా ఉండే వ్యక్తులతో సర్పంచ్‌లపై ఫిర్యాదులు చేయిస్తున్నారు. ఫిర్యాదును స్వీకరించిన అధికారులు డివిజనల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్లతో విచారణ చేయిస్తున్నారు. విచారణ సమయంలో నిధులు డ్రాకు సంబంధించి బిల్లులు లేవు, ఇష్టానుసారంగా నిధులు డ్రా చేస్తున్నారంటూ షోకాజు నోటీసులు ఇచ్చాం. ఎటువంటి వివరణ ఇవ్వలేదని సాకు చూపి చెక్ పవర్ రద్దు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఈ చెక్‌పవర్స్ రద్దు తంతు అధికమైంది. పంచాయతీల్లో టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ పార్టీలో చేరిన వారికి ఎటువంటి ఇబ్బందులు కల్పించడం లేదు. వైఎస్సార్‌సీపీ అనుకూలంగా ఉండే సర్పంచ్‌లకు కూటమి నాయకులు చుక్కలు చూపిస్తున్నారు. వివిధ రకాలుగా హింసిస్తున్నారు. చేసిన పనులకు సైతం బిల్లులు రాకుండా అడ్డు పడుతున్నారు. ఈ విధంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లే టార్గెట్‌గా జిల్లాలో ఇప్పటి వరకు తొమ్మిది మందికి పైగా సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేశారు. కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెం, రేగడిచెలిక, పెయ్యలపాళెం, నెల్లూరురూరల్ మండలం కలివెలపాళెం, సజ్జాపురం, పెనుబర్తి, ముత్తుకూరు మండలం కృష్ణపట్నం, పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం, మర్రిపాడు మండలం కేతిగుంట తదితర మండలాల్లో సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేశారు.

డీపీఓ ఏక పక్ష నిర్ణయాలు

జిల్లా పంచాయతీ అధికారి గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త సంప్రదాయానికి తెర తీశారు. దున్నపోతు ఈనిందంటే.. దూడను దొడ్లో కట్టేయమన్న సామెత చందంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఫిర్యాదు వెళ్లిన గంటల్లోనే ఆగమేఘాల మీద సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, ఆ వెంటనే వారి చెక్‌పవర్ రద్దు చేయడం జరిగిపోతున్నాయి. ఆయా పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం అయితే ఎలా జరిగియో కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు, విచారణ లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాజకీయ పార్టీల నేతకు కొమ్ము కాయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ ఒత్తిళ్లపై వైఎస్సార్‌సీపీ ఆందోళన

జిల్లాలో సర్పంచ్‌లపై రాజకీయ ఒత్తిళ్లు అధికం కావడంతో ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నేతృత్వంలో కొడవలూరు మండలంలో కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహించారు. అయినప్పటికీ టీడీపీ నేతలు పార్టీ మార్పుపై బలవంతపు రాజకీయాలకు తగ్గడం లేదు.

అవినీతి ఒప్పు అవుతుందా?

పార్టీ మారితే అవినీతి ఆరోపణలు ఒప్పు అయిపోతాయా? అంటూ జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోవూరులో దిగజారుడు రాజకీయాలకు ఎమ్మెల్యే ప్రశాంతి తెర తీశారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 82 పంచాయతీల్లో 70 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు గెలుపొందారు. బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లో అన్ని సర్పంచ్‌ల స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుని క్లీన్‌స్వీప్ చేసింది. అయితే ప్రశాంతిరెడ్డి ఎన్నికల సమయంలో భారీగా ఆర్థిక తాయిలాలు ప్రకటించడంతో కొందరు అప్పుడే పచ్చ కండువాలు కప్పుకున్నారు. మెజార్టీ సర్పంచ్‌లు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీని వీడేందుకు సిద్ధపడలేదు. దీంతో వీరిపై రాజకీయంగా ఒత్తిడి పెంచారు. భేషరతుగా టీడీపీలో చేరాలంటూ సామదాన దండోపాయాలు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో కొడవలూరు మండలంలోని రేగడిచెలిక, పెమ్మారెడ్డిపాళెం, పెయ్యలపాళెం సర్పంచ్‌లపై ఆయా పంచాయతీల్లో తన అనుచరుల ద్వారా అవినీతి జరిగిందంటూ కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయించి చెక్ పవర్ రద్దు చేయించారు. ఈ క్రమంలో మరింత ఒత్తిడి పెంచి పార్టీలోకి బలవంతంగా చేర్చుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రేగడిచెలిక సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం.

గౌతమ్‌కు కొనసాగుతున్న అవమానం



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి సమావేశ మందిరం బోర్డును కనిపించకుండా ప్లాస్టిక్ షీట్‌తో మూసివేసిన దృశ్యం

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని అవమానించడంలో అధికార పార్టీ నేతలతో అధికారులు సైతం పోటీ పడుతున్నారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరానికి నాలుగేళ్ల క్రితమే గౌతమ్‌రెడ్డి జ్ఞాపకార్థం 'మేకపాటి గౌతమ్‌రెడ్డి సమావేశ మందిరం' నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గౌతమ్‌రెడ్డి పేరుతో ఉన్న జ్ఞాపకాలను చెరిపేస్తూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో అవమానించారు. తాజాగా శుక్రవారం మరోసారి అవమానించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు వచ్చిన క్రమంలో ఆయన ఆదేశాలో.. లేక అధికారుల అత్యుత్సాహమో తెలియదు కానీ గౌతమ్‌రెడ్డి పేరే కనిపించకుండా అసలు సమావేశ మందిరం అనే అక్షరాలే కనిపించకుండా నల్ల ప్లాస్టిక్ షీట్‌తో కప్పేశారు. ఇది చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో పోటీ పడకపోయినా ఇలాంటి కక్ష సాధింపు చర్యల్లో కూటమి నేతలు ముందున్నారని పలువురు వ్యాఖ్యానించారు.

తలనీలాల వేలం ద్వారా రూ.2.30 కోట్ల రాబడి

వలేటివారిపాళెం: జిల్లాలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాల సేకరణకు నిర్వహించిన వేలంలో రూ.2.30 కోట్ల రాబడి వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం దేవస్థానంలో పలు వ్యాపారాలకు వేలం నిర్వహించారు. తలనీలాలకు సంబంధించి ఏలూరుకు చెందిన సూర్యోదయ ఎంటర్ ప్రైజర్స్ రూ.1.82 కోట్లకు వేలం పాడగా, సీల్డ్ టెండర్ ద్వారా గుంటూరుకు చెందిన గౌతమ్ బుద్ధా ప్రాజెక్ట్ సంస్థ రూ.2.30 కోట్లకు టెండర్ వేసి దక్కించుకుంది. గతేడాది కంటే తలనీలాలు వేలం ద్వారా రూ.80 లక్షలు అదనంగా వచ్చినట్లు ఈఓ తెలిపారు. కొబ్బరి చిప్పలు, కొబ్బరి కాయలు విక్రయ వేలానికి పాటదారులు రాకపోవడంతో వాయిదా వేశారు. పూజ సామగ్రి వేలంలో రూ.33.60 లక్షలకు మించలేదు. అయితే గతేడాది రూ.35 లక్షలు ఉండగా అంతకంటే తక్కువ అయితే.. వేలం వాయిదా వేస్తామని అధికారులు ప్రకటించారు. చివరకు వేలం వాయిదా వేసినట్లు ఆయన ప్రకటించారు. కందుకూరు శివాలయ ఈఓ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో ఈ వేలం ప్రక్రియ జరిగింది. ఆలయ సిబ్బంది వెంకటేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.

పరిశ్రమల కోసం భూముల పరిశీలన



కావలి: సర్వాయపాళెంలో భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న యువరాజ్, కలెక్టర్ ఆనంద్



ఉలవపాడు: మ్యాపులను పరిశీలిస్తున్న అధికారులు

ఉలవపాడు/కావలి: రామాయపట్నం పోర్టు ఆధారితంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కావలి, ఉలవపాడు మండలాల పరిధిలో అనువైన భూములను రాష్ట్ర వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, కలెక్టర్ ఓ ఆనంద్ శుక్రవారం పరిశీలించారు. తొలుత ఉలవపాడు ఉత్తర బైపాస్‌లో పెట్రోల్ బంక్ సమీపంలో భూములతోపాటు అలగాయపాళెంకు చెందిన వ్యవసాయ భూములను, అనంతరం కరేడు చెరువును, టెంకాయచెట్లపాళెంలోని భూములను పరిశీలించారు. అక్కడి నుంచి కావలి మండలంలోని ఆనెమడుగు, సర్వాయపాళెం, చెన్నాయపాళెం గ్రామాల్లోని భూములను చూశారు. మ్యాపుల సహాయంతో ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను కలెక్టర్ వివరించారు. ఇప్పటికే వివిధ పరిశ్రమలకు కేటాయించిన భూమి వివరాలపై ఆరా తీశారు. అనంతరం చెన్నాయపాళెం వెళ్లి అక్కడి భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, ఉలవపాడు తహసీల్దార్ లావణ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

అయ్యోరూ ఏందీ ఈ పని

- ఆయన కాళ్లు పడితేనే చదువు చెప్తాడంట
- మరుగుదొడ్డికి వెళ్లాలంటే పిల్లలు డబ్బాతో నీళ్లు పట్టుకుని వెళ్లాలి
- చదువు చెప్పడం మాని పిల్లలను బానిసల్లా చూస్తున్నాడు
- ఉపాధ్యాయుడు రవీంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

మర్రిపాడు: ఆయనొక గురువు. తల్లిదండ్రుల తర్వాత స్థానంలో ఉన్న వ్యక్తి. ఆయన తీరు ఉపాధ్యాయ వ్యవస్థకే కళంకం తెస్తోంది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఆ ఉపాధ్యాయుడు నియంతృత్వ పోకడలతో వ్యవహరిస్తున్నాడు. తన బిడ్డల్లాంటి విద్యార్థులతో కాళ్లు పట్టించుకోవడం, మరుగుదొడ్డికి వెళ్లాంటే డబ్బాలతో నీళ్ల పట్టుకుని ఆయన వెంట తీసుకెళ్లడం, ఆయన తిన్న ప్లేట్లు కడిగించడం వంటి బానిస పనులు చేయించుకుంటున్న వైనంపై తల్లిదండ్రులు మండి పడుతున్నారు. మండలంలోని కదిరినేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రవీంద్రబాబు వ్యవహరిస్తున్న తీరుపై తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ శుక్రవారం మీడియా దృష్టికి తీసుకువచ్చారు. సదరు ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, వచ్చిన ఆలస్యంగా రావడం, ముందుగానే వెళ్లిపోతున్నాడంటూ ఆరోపించారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు, ఉపాధ్యాయుడు కుమ్మక్కై తమ సమస్యలను కప్పిపుచ్చుతున్నారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్న ఆ ఉపాధ్యాయుడిపై జిల్లా ఉన్నతాధికారులు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈఓను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే ఉపాధ్యాయుడితో మాట్లాడామని, పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణదారులకు నీళ్లు అడిగితే ఇవ్వని కారణంగా అకారణంగా తనపై ఇలాంటి ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారని, అయినప్పటికీ సోమవారం పాఠశాలలో విచారిస్తామని తెలిపారు.

అవినీతి జలగలు

నెల్లూరు నగరపాలక సంస్థలో లంచావతారులు రెచ్చిపోతున్నారు. కార్పొరేషన్‌కు గుండెకాయ లాంటి రెవెన్యూ విభాగం అవినీతి మయంగా మారింది. ఖజానాకు చేరాల్సిన సొమ్ము రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నుంచి ఉన్నతస్థాయి అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విభాగం అధికారుల అవినీతిపై ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు అవుతున్నాయని విమర్శలు లేకపోలేదు. పన్నుల వసూళ్లలో ఓ ఆర్‌ఐ అవినీతి బండారాన్ని ఆధారాలతో సహా గతేడాది డిసెంబరులో ఫిర్యాదు చేసినా ఇంత వరకు సదరు అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తే వీరు చేసే అవినీతిలో ఉన్నతాధికారులకు వాటాలు వెళ్తున్నాయనే ఆరోపణలకు అద్దం పడుతోంది.



నగరంలోని ఓ లేఅవుట్‌లో ఉన్న ఇంటికి వెళ్లిన ఆర్‌ఐ 'మీ ఇంటికి పన్ను వేయించుకోండి' అని యజమానితో చెప్పి తన ఫోన్ నంబర్ ఇచ్చి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సదరు ఇంటి యజమాని తన కుమార్తెకు ఆర్‌ఐ వచ్చి వెళ్లిన విషయం చెప్పగానే ఆమె ఫోన్ చేసింది. మీ ఇంటికి డీవియేషన్ లేదు కాబట్టి అధిక మొత్తంలో పన్ను వేస్తాం అని ఆర్‌ఐ బెదిరించాడు. దీంతో ఆ మహిళ తనకు సాంకేతిక విషయాలు తెలియవు అని చెప్పగా, నాకు రూ.50 వేలిస్తే మీకు ఇబ్బంది లేకుండా చేస్తానని ఆర్‌ఐ చెప్పాడు. ఆ మహిళ మా నాన్నకు ఆరోగ్యం బాగోలేదు. తాము అంత డబ్బు ఇవ్వలేమని చెప్పినా కూడా ఆర్‌ఐ వినిపించుకోకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ నేను ఒక్కడినే తీసుకోవడం లేదని, మా పై వాళ్లకు కూడా వాటాలు ఇవ్వాలని కోపగించుకుంటూ ఫోన్ పెట్టేశాడు. ఈ విషయాన్ని ఆ మహిళ గత ఏడాది డిసెంబర్ 27వ తేదీన లిఖిత పూర్వకంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును పరిశీలించాలని డిప్యూటీ కమిషనర్‌కు సిఫార్సు చేశారు. అయితే ఆ ఫిర్యాదుపై ఇంత వరకు ఎలాంటి చర్యలు లేవు.

కార్పొరేషన్‌ను పీల్చిపిప్పి చేస్తున్న ఆర్‌ఐలు

- పన్నుల వసూళ్లలో చేతివాటం
- అడిగినంత ఇస్తే.. సక్రమం చేస్తామంటూ ఫోన్లు
- ఉన్నతాధికారులకు వాటాలివ్వాలంటూ చెబుతున్న వైనం
- ఓ ఆర్‌ఐపై మహిళ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు (బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లలో రెవెన్యూ విభాగాధికారులు అమాయకులను బెదిరించి అందిన కాడికి దోచుకుంటున్నారు. కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టుతున్నారు. ఇంటి పన్నుల విధింపులో తేడాలు ఉంటే సరిచేసి పన్ను నిర్ధారించాలని ఇటీవల మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ అవకాశాన్ని ఆర్‌ఐలు అందిపుచ్చుకుని దొరికినంత దిగమింగుతున్నారు. డీవియేషన్ ఉన్న ఇళ్ల యజమానుల నుంచి లంచాలు దండుకుంటూనే మరో వైపు ఎలాంటి డీవియేషన్ లేకపోయినా భారీ మొత్తంలో చెల్లించాలంటూ ఓ ఆర్‌ఐ చేసిన డిమాండ్ చూస్తే కళ్లు బైర్లు కమ్ముకుంటాయి. సదరు ఆర్‌ఐ మాట్లాడిన ఫోన్ కాల్‌ను వాయిస్ రికార్డు చేసి కార్పొరేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇక్కడి అవినీతి బాగోతం వెలుగు చూసింది.

ఎవరి వాటాలు ఎంతెంత!

నూతన భవనానికి ఆస్తి పన్ను విధింపులో ఆర్‌ఐలు తమ తెలితేటలు ప్రదర్శిస్తూ సదరు భవన యజమానుల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుని అందులో నుంచి అన్ని స్థాయిలో ఉన్న అధికారులకు వాటాలు పంచుకునే పరిస్థితి. మొత్తం ఆరుగురు ఆర్‌ఐలు ఉన్నారు. వీరందరూ నెలకొక సారి ఎవరు ఎంత ముడుపులు పుచ్చుకున్నారో అందులో నుంచి వీరిపై ఉన్న రెవెన్యూ అధికారి (ఆర్‌ఓ)కి, ఆపై అధికారి డిప్యూటీ కమిషనర్ (డీసీ)కి ఆయా అధికారుల స్థాయిని బట్టి వాటాలు పంచుకుంటున్నారని తెలుస్తోంది.

వాస్తవ పరిస్థితి ఇదీ

కార్పొరేషన్ పరిధిలో 54 డివిజన్లలో మొత్తం రూ.187 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. జనవరి నెల వరకు రూ.64 కోట్లు మాత్రమే వసూలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన మొత్తం 436 భవనాల నుంచి ఆస్తి పన్ను రూపంలో రూ.14.20 కోట్లను వసూలు చేయాల్సి ఉండగా, ఇది రూ.కోటికే పరిమితమైంది.

కేటగిరీ	అసెస్‌మెంట్లు	రాబడి	వసూలు
ఖాళీ స్థలాలు	6,500	రూ.17.5 కోట్లు	రూ.5 కోట్లు
ఇంటి పన్ను	1.33 లక్షలు	రూ.97 కోట్లు	రూ.41 కోట్లు
కుళాయిలు (గృహాలు)	45,177	రూ.39,48,80,407	రూ.7,10,96,653
కమర్షియల్ కనెక్షన్లు	969	రూ.19,42,22,913	రూ.9,83,75,653

ఖజానాకు కన్నం

నగరాభివృద్ధి సజావుగా సాగాలంటే ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులతో పాటు ట్రేడ్‌లైసెన్స్ ద్వారా వచ్చే ఫీజుల ద్వారా వచ్చే రాబడే కీలకం. నగర పాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్యాన్ని సాధించలేకపోతుండడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. మరో వైపు కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయిల వసూళ్లను గాలికొదిలేసి తమ జేబులు నింపుకునేందుకే రెవెన్యూ అధికారుల ఆరాటపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పన్నుల వసూళ్ల లక్ష్యాలను మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజ నిర్దేశించినా, వీరు మాత్రం నిర్లిప్త ధోరణిని అవలంబిస్తున్నారు. భవనాన్ని నిర్మించుకున్న వారు పన్ను వేయించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే, అడిగినంత ఇస్తే వారి ఫైల్‌ను మాత్రమే క్లియర్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో మిగిలిన ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. దీర్ఘకాలిక బకాయిలున్న అసెస్‌మెంట్ల నుంచి పన్నులను వసూలు చేయడంలోనూ ఇదే పరిస్థితి. దీంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

నూరు శాతం పన్ను వసూళ్లకు చర్యలు



బకాయిదారులు సకాలంలో పన్ను చెల్లించి, అభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తూనే ఉన్నాం. స్పందించని పక్షంలో ఇంటి కుళాయి, విద్యుత్ కనెక్షన్ కట్ చేయిస్తున్నాం. రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేస్తూ పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల పన్ను వసూళ్లకు నోటీసులు జారీ చేస్తాం. ఆస్తి పన్ను విధింపులో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటాం.

– సూర్యతేజ, కమిషనర్, నెల్లూరు.

క్లుప్తంగా

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



దెబ్బతిన్న కారు ముందుభాగం

సంగం: మండల కేంద్రమైన సంగంలో జాతీయ రహదారి సర్కిల్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కారు సంగం నుంచి హసనాపురం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఆత్మకూరు వైపు వెళ్తున్న మినీలారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బలరామిరెడ్డి అనే వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. కారులోని ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? ఆర్థిక ఇబ్బందులో? మరే ఇతర కారణమో తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరులోని సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై జరిగింది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. నలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ షర్ట్, నలుపు రంగు చెక్స్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడిచేతిపై 'వీఈ' అని ఇంగ్లిష్ అక్షరాలు రాసి ఉన్నాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు.

'మా గ్రామంలో ఇసుక రీచ్ వద్దు'



రీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇందుకూరుపేట: మా గ్రామంలో ఇసుక రీచ్ వద్దంటూ మండలంలోని ముదివర్తిపాళెం వాసులు అధికారులకు తెలిపారు. రీచ్ ఏర్పాటుపై గ్రామంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. దీనికి ఆర్డీఓ అనూష హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇక్కడ రీచ్ ఏర్పాటు చేస్తే నీరు ఉప్పగా మారిపోతుందని వాపోయారు. అలాగే వాహనాల రద్దీ పెరిగి తీవ్ర ఇబ్బందులు పడతామన్నారు. ఈ ప్రాంతంలో రీచ్ ఏర్పాటు చేసేందుకు వీల్లేదని లోకాయుక్త గతంలో ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఆర్ఐ విద్యాసాగర్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో జరుగుతున్న రీ సర్వే, ఈ–క్రాప్‌ను ఆర్డీఓ తనిఖీ చేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.37
సన్నవి :	రూ.27
పండ్లు :	రూ.18

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	112
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	230
లేయర్ చికెన్ :	145

వద్దన్నా.. వినకుండా..

- రొయ్యలు, చేపల గుంతల్లో నిషేధిత యాంటీ బయోటిక్స్ వినియోగం
- యథేచ్ఛగా విక్రయిస్తున్న కొందరు షాపుల నిర్వాహకులు
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- ఆ ఉత్పత్తులు తింటే ఆరోగ్య సమస్యలే..



తనిఖీలు చేస్తున్న మత్స్యశాఖాధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): రొయ్యలు, చేపల పెంపకందారులకు కొందరు ఆక్వా షాపుల యజమానులు యథేచ్ఛగా నిషేధిత యాంటీ బయోటిక్స్ విక్రయిస్తున్నారు. ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని సంబంధిత అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం అధికారికంగా సూచించిన వాటినే విక్రయించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా షాపుల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. కొందరు పెంపకందారులు కూడా వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చేపల, రొయ్యల గుంతల్లో వినియోగిస్తున్నారు. జిల్లాలో సుమారు 22 వేల ఎకరాల్లో రొయ్యలు, 11 వేల ఎకరాల్లో చేపలు సాగు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గుంతల్లో పెరిగే రొయ్యల, చేపలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినా, లేక రాకుండా ఉండేందుకు యాంటీ బయోటిక్స్‌ను పెంపకందారులు వినియోగిస్తుంటారు, ప్రధానంగా రొయ్యల మేత, మందులు, ప్రో బయోటిక్స్ విక్రయాలు చేసే షాపుల్లో వాటిని విక్రయిస్తుంటారు. కాగా సదరు ఆక్వా షాపులు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతి తీసుకోవాలి. జిల్లాలో సుమారు 54 షాపులుండగా, అనధికారికంగా మరో 24 ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

లైసెన్స్‌లు లేకుండానే..

రొయ్యలు, చేపలను ఇతర ప్రాంతాలకు కంటైనర్ల ద్వారా తరలిస్తుంటారు. వాటిని అక్కడి అధికారులు పరీక్షిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడుతున్నట్లు గుర్తించారు. దీంతో పలు కంటైనర్లను తిరిగి జిల్లాకు పంపిన వైనం జిల్లా అధికారుల దృష్టికి ఇటీవల వచ్చింది. దీంతో అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. చాలాచోట్ల లైసెన్స్‌లు లేకుండా నిషేధిత యాంటీ బయోటిక్స్ విక్రయాలు చేస్తున్నట్లు బయటపడింది. కొన్ని షాపులకు అసలు లైసెన్స్‌లు లేవని, తీసుకోవాలని సూచించినా పట్టించుకోలేదని గుర్తించారు. 9 షాపులకు రూ.25 వేల చొప్పున జరిమానా విధించారు. కాగా నిషేధిత యాంటీ బయోటిక్స్ ద్వారా పెరిగిన ఉత్పత్తులను కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు కొన్నిరోజులుగా తనిఖీలు చేస్తున్నా కొందరు విక్రయదారుల తీరు మారలేదని తెలుస్తోంది.

కఠిన చర్యలు తీసుకుంటాం



రొయ్యలు, చేపలకు సంబంధించిన మేత, ఇతర పదార్థాలను లైసెన్స్ లేకుండా విక్రయాలు చేసినా, లేక నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించాం.

– నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖాధికారి

ఆరోగ్య సమస్యలు వస్తాయి



నిషేధిత యాంటీ బయోటిక్స్ ద్వారా పెరిగిన చేపలు, రొయ్యలను తింటే మనుషులకు ఆరోగ్య సమస్యలు వస్తాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చేపలు, రొయ్యల గుంతల్లో వాటిని వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి.

– నిరంజన్, నెల్లూరు

చర్యలు తీసుకోవాలి



చేపలు, రొయ్యల గుంతల్లో ముందు జాగ్రత్తగా తక్కువ ధరకు లభించే నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడుతున్నట్లు తెలుస్తోంది. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

– వెంకటసుబ్బయ్య, ఎల్ఎస్‌పురం, మనుబోలు మండలం

ఇంజెక్షన్ వేస్తున్నట్టు నటిస్తూ నగల చోరీ

నెల్లూరు(క్రైమ్): ఆరోగ్యం బాగోలేని ఓ వ్యక్తికి ఇంజెక్షన్ వేస్తున్నట్లు నటిస్తూ బంగారు ఆభరణాలు అపహరించిన ఘటనలో నిందితుడిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. ఫత్తేఖాన్‌పేటకు చెందిన కార్తీక్ నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. మాగుంట లేఅవుట్‌కు చెందిన ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఆ హాస్పిటల్లో చికిత్స చేయించుకున్న సమయంలో కార్తీక్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇటీవల ఉదయ్‌శేఖర్‌రెడ్డికి అనారోగ్యంగా ఉండటంతో కార్తీక్ అతడి ఇంటికెళ్లి ఇంజెక్షన్ వేస్తున్నట్టు నటిస్తూ కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించాడు. ఈ విషయాన్ని పసిగట్టిన బాధితుడు గురువారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడిని బట్వాడిపాళెం సెంటర్‌లో అరెస్ట్ చేశారు. అతడి నుంచి చోరీ సొత్తు 95 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

కండలేరులో 54.060 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 54.060 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హై లెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

చెడు వ్యసనాలకు బానిసై..



స్వాధీనం చేసుకున్న వాహనాలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా
- నలుగురు నిందితుల అరెస్ట్
- రూ.30 లక్షలు విలువైన 56 బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): చెడు వ్యసనాలకు బానిసైన నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మోటార్‌బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరగసాగారు. వారి కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు సీసీఎస్, కొడవలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.30 లక్షల విలువైన 56 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జి.కృష్ణకాంత్ నిందితుల వివరాలను వెల్లడించారు. అల్లూరు మండలం నార్త్ ఆమలూరుకు చెందిన ఎ.శివ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. 2017లో హత్యాయత్నం కేసులో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతను తన చిన్నమ్మ కుమారుడైన రవిదుర్గతో కలిసి బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు. అనంతరం పాతనేరస్తులైన అల్లూరు మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన కె.నాని, హోసన్నలను కలుపుకొని ముఠాగా ఏర్పడ్డారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని తూర్పుగోదావరి, వైఎస్సార్, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడ్డారు.

ఎస్పీ ఆదేశాలతో..

ఇటీవల బైక్ దొంగతనాలు అధికమయ్యాయి. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సీఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బైక్ దొంగతనాలపై దృష్టి సారించి నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈనెల 6వ తేదీన వారు కొడవలూరు మండలం పద్మనాభసత్రం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా నెల్లూరు జిల్లాలో 24, తిరుపతి జిల్లాలో 21, ప్రకాశం జిల్లాలో 8, బాపట్ల, వైఎస్సార్, తూర్పుగోదావరి జిల్లాల్లో మూడు బైక్‌లు మొత్తంగా రూ.30 లక్షలు విలువైన 56 బైక్‌లను దొంగలించినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్‌చేసి వారి వద్దనుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి బైక్‌లను స్వాధీనం చేసుకున్న సీసీఎస్, కొడవలూరు సీఐలతో పాటు కొడవలూరు, విడవలూరు, సీసీఎస్ ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్, వెంకటాద్రినాయుడుతోపాటు వారి సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు, నెల్లూరు రూరల్ డీఎస్పీలు పి.సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- ఇదీ టెక్నికల్ అసిస్టెంట్ల తీరు
- క్షేత్రస్థాయిలో కొలతలు తీయడం లేదు
- పక్క జిల్లాల్లో నివాసం.. చుట్టపుచూపుగా విధులకు..
- వారానికి రెండుసార్లు వచ్చి మస్తర్ల అప్‌లోడ్

నెల్లూరు(పొగతోట): వలసలు నివారించేందుకు అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. నిబంధనల మేరకు సిబ్బంది విధులు నిర్వహించడం లేదని విమర్శలున్నాయి. జిల్లాలో సుమారు 4 లక్షల మంది జాబ్‌కార్డులు కలిగిన కూలీలున్నారు. పనుల నిర్వహణకు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏ), మేట్లు ఉన్నారు. మండల స్థాయికి వచ్చేసరికి ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ), ఒక ఇంజినీరింగ్ కన్సల్టెంట్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లున్నారు. మస్తర్లు అప్‌లోడ్ చేసేందుకు మండలంలో కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉన్నారు.

ఏం చేయాలంటే..

రోజూ ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు పనులు కల్పిస్తారు. కూలీలు చేసిన పనులను టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి కొలతలు తీసి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే అందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులున్నాయి. టెక్నికల్ అసిస్టెంట్లు కార్యాలయంలో కూర్చొని ఎఫ్ఏలు చెప్పిన పనుల వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారని విమర్శలున్నాయి. కొందరు ఇతర జిల్లాల్లో నివాసం ఉంటూ వారానికి ఒకటి, రెండురోజులు చుట్టపు చూపుగా జిల్లాకు వచ్చి విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కలువాయి మండలానికి సంబంధించిన టీఏ వైఎస్సార్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వారానికి ఒకసారి కార్యాలయానికి వచ్చి ఎఫ్ఏలు చెప్పిన మెజర్‌మెంట్లను అప్‌లోడ్ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. ఇంకా సీతారామపురం, ఉదయగిరి, కలిగిరి, వింజమూరు తదితర ప్రాంతాల్లో కూడా ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారున్నారు. కొందరు వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రమే కార్యాలయానికి వచ్చి వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు.

ఇలా..

జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. టీడీపీ కార్యకర్తలను ఎఫ్ఏలుగా, మేట్లుగా నియమించుకుని పనులు చేయిస్తున్నారు. కూలీలు లేకుండానే పనులు చేస్తున్నట్లు మస్తర్లను నమోదు చేస్తున్నారు. వాటిని టీఏలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. టెక్నికల్ అసిస్టెంట్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శిక్షణ ఇస్తాం

టీఏలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చేసిన పనుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. టెక్నికల్ అసిస్టెంట్లకు త్వరలో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తాం.

– గంగా భవాని, డ్వామా పీడీ

లేబర్ కాంట్రాక్టర్ బలవన్మరణం



జగదీష్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): లేబర్ కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. సావిత్రి నగర్‌లో జగదీష్ (47), యశోధ దంపతులు నివాసం ఉంటున్నారు. జగదీష్ లేబర్ కాంట్రాక్టర్‌గా ఉన్నాడు, యశోధ వేదాయపాళెంలోని నారాయణ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. వారి కుమారుడు మునిసోమేష్ గుజరాత్‌లో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. జగదీష్ మద్యానికి బానిసయ్యాడు. ఆరునెలల క్రితం అతను అనారోగ్యానికి గురికావడంతో హాస్పిటల్లో చూపించగా లివర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, మద్యం తాగడం మానేయాలని వైద్యులు సూచించారు. దీంతో మద్యం తాగొద్దని పలుమార్లు భార్య చెప్పినా అతను పట్టించుకోలేదు. పదిరోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు సైతం అతడిని వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం యశోధ కాలేజీకి వెళ్లింది. ఆమె రాత్రి ఇంటికి వచ్చేసరికి జగదీష్ హాల్లో ఉరేసుకుని కనిపించాడు. యశోధ ఈ విషయాన్ని స్థానికులకు తెలియజేసింది. వారి సాయంతో భర్తను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే జగదీష్ మృతిచెందాడని నిర్ధారించారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విజయ్‌కుమార్ హాస్పిటల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారం మాది.. దోచేస్తాం..



అగ్రిగోల్డ్ భూముల్లో తెల్లరాయి గుట్టలు



అగ్రిగోల్డ్ భూముల్లో గుట్టలుగా ఉన్న కలప



పోలీసులు స్వాధీనం చేసుకున్న కలప

- అగ్రిగోల్డ్ భూముల్లో ఇష్టారాజ్యం
- సహజ సంపదపై కన్నేసిన కూటమి నేతలు
- విచ్చలవిడిగా తెల్లరాయి తవ్వకాలు
- జామాయిల్ చెట్ల నరికివేత

చిల్లకూరు: కూటమి నేతలు అధికార మదంతో చెలరేగిపోతున్నారు. అధికారులను మచ్చిక చేసుకుని సహజ సంపదను కొల్లగొడుతున్నారు. ఇలాంటిదే చిల్లకూరు మండలంలో చోటుచేసుకుంది. అగ్రిగోల్డ్‌కు చెందిన భూముల్లో తెల్లరాయి తవ్వకాలతోపాటు జామాయిల్ తోటలను నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటు సీఐడీ, ఇటు రెవెన్యూ శాఖలు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అసలేం జరుగుతోందంటే..

ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం ఎగువరాజుపాళెం ప్రాంతంలో గత టీడీపీ హయాంలో అగ్రిగోల్డ్ యాజమాన్యం సుమారు 470 ఎకరాల భూములను కొనుగోలు చేసింది. అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించింది. అందులో సుమారు వంద ఎకరాల్లో ప్లాట్లు వేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంది. అనంతరం అగ్రిగోల్డ్ సంస్థలో జరిగిన పలు కుంభకోణాల వల్ల ఎక్కడ భూములను అక్కడే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందులో భాగంగా చిల్లకూరు మండలంలో ఉన్న అన్ని రియల్ ఎస్టేట్లతోపాటు ఎగువరాజుపాళెంలోని 470 ఎకరాలు సీఐడీ పర్యవేక్షణలోకి వెళ్లిపోయాయి. దీంతో ఆ భూముల వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. ఇదే అదనుగా భావించిన కూటమి నేతలు ఆ భూముల్లోని సహజ సంపదను దోచుకునేందుకు పోటీ పడుతున్నారు.

అక్రమంగా..

ఇటీవల ఓజిలి మండలం, భువనగిరిపాళెం వైపున ఉన్న భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి క్వార్ట్జ్ తవ్వకాలు చేపట్టారు. గతేడాది కూడా అగ్రిగోల్డ్ భూముల్లోని తెల్లరాయిని తవ్వేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు గుర్తించి ఆ ప్రాంతంలో ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్తబ్దుగా ఉన్న కూటమి నేతలు అధికారంలోకి రావడంతోనే చెలరేగిపోతున్నారు. అయితే గ్రామస్తులు అడ్డుకోవడంతో తవ్వకాలను నిలిపి వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామస్తులు అడ్డుకోకుండా ఉంటే సుమారు రూ.50 లక్షల విలువైన ఖనిజ సంపద బయటకు వెళ్లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

విచ్చలవిడిగా..

టీడీపీ కేంద్ర కార్యాలయంలో పలుకుబడి ఉన్న కొంతమంది మరొక అడుగు ముందుకేసి అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ చెట్లను నరికి సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ కలప విలువ కూడా సుమారు రూ.20 లక్షల వరకు ఉండొచ్చని అంటున్నారు. కలపను నరికిన వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేయకుండా రెవెన్యూ అధికారుల ద్వారా కేసు పెట్టేందుకు ప్రయత్నించగా వారు కూడా సదరు వ్యక్తులు తమకు తెలియదని చేతులెత్తేశారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు నరికినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు మూడు లారీల కలపను స్వాధీనం చేసుకున్నారు. ఇది జరిగి మూడు రోజులవుతున్నా కేసులు నమోదు చేయడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయంపై సీఐడీకి చెందిన సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.